సాక్షి
వైయస్‌ఆర్ జిల్లా

గురువారం। 9। మార్చి। 2023



పాపం... ప్రవీణ్

ఆడుతూ పాడుతూ గడపాల్సిన 12 ఏళ్ల బాలుడికి పెద్ద కష్టం వచ్చింది. ఉదయం నుంచి సాయంత్రం వరకు వెలుగును చూడ లేక పోతున్నాడు. -8లో..



బీడీ తెచ్చిన తంటా..

రాత్రి పొద్దుపోయాక నిద్ర పట్టక పోవడంతో ఓ వ్యక్తి ఇంట్లో బీడీ తాగేందుకు అగ్గిపుల్ల వెలిగించాడు. దీంతో ఒక్కసారిగా పెద్ద శబ్దంతో ఇంట్లో మంటలు చెలరేగాయి. -8లో..

వాతావరణం

గరిష్టం/కనిష్టం 34.1/19.1

జిల్లాలో బుధవారం 19.1 - 34.1 డిగ్రీల మధ్య ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. గంటకు 1.8 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి. -కడప అగ్రికల్చర్

బడి నిర్వహణకు నిధి

- పాఠశాలలకు నిర్వహణ గ్రాంటు
- జిల్లాకు రెండో విడతలో రూ. 95.79 లక్షలు విడుదల
- త్వరలో ఖాతాలకు జమకానున్న నిధులు



కడపలోని గవర్నమెంట్ బాలికల హైస్కూల్

కడప ఎడ్యుకేషన్: రాష్ట్ర ప్రభుత్వం విద్యకు అత్యంత ప్రాధాన్యం ఇస్తోంది. ఇప్పటికే నాడు నేడు కింద పాఠశాలలను సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దింది. దీంతోపాటు పిల్లలకు కావాల్సిన అన్ని రకాల మౌలిక వసతులైన అదనపు తరగతి గదులు, తాగునీరు. టాయిలెట్లు, ఫర్నిచర్ తదితర అన్ని రకాల సౌకర్యాలను కల్పించారు. దీంతోపాటు విద్యార్థులకు చదువుతోపాటు పౌష్టికాహారాన్ని అందిస్తోంది. వీటితోపాటు పాఠశాలకు నిర్వహణ ఖర్చులకు కూడా ప్రభుత్వం క్రమం తప్పకుండా నిధులను విడుదల చేస్తోంది. 2022-23 విద్యా సంవత్సరానికి సంబంధించి రెండో విడత పాఠశాలల మెయింటెనెన్స్ గ్రాంటు విడుదల చేస్తూ ప్రభుత్వం తాజాగా ఉత్తర్వులు జారీ చేసింది.

గ్రాంటు విడుదల ఇలా..

పాఠశాలల్లో పలు రకాల అవసరాల నిమిత్తం ప్రభుత్వం నిధులు ఇస్తుంది. ఈ నిధులతో పాఠశాలలో స్టేషనరీ కొనుగోలు, చాక్‌పీసులు, పేరెంట్ కమిటి సమావేశాలు, టాయిలెట్ల నిర్వహణ, తాగునీరు, టీచింగ్ లర్నింగ్ మెటీరియల్ వంటి వాటిని ఈ గ్రాంటు ద్వారా సమకూర్చుకోవచ్చు. ఈ నిధులు విద్యార్థుల సంఖ్య ఆధారంగా ఇవ్వనుంది. ఇందులో 1 నుంచి 30 మంది విద్యార్థులు ఉంటే రూ. 10 వేలు, 31 నుంచి 100 మంది విద్యార్థులు ఉంటే రూ. 25 వేలు, 101 నుంచి 250 వరకు విద్యార్థులుంటే రూ. 50 వేలు, 251 నుంచి 1000 మంది విద్యార్థులుంటే రూ. 75 వేల వరకు ఇవ్వనున్నారు.

రెండో విడతలో రూ. 95.79 లక్షలు...

జిల్లాలో రెండో విడతగా ఉమ్మడి వైఎస్సార్‌జిల్లా 2013 స్కూల్స్‌కుగాను రూ. 95,79,000 విడుదల చేశారు. ఈ నిధులను ఆయా ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల ఖాతాలకు జయచేసే పనిలో అధికారులు నిమగ్నమయ్యారు.

విద్యార్థుల సంఖ్య	జిల్లాలోని పాఠశాలలు	ఒక్కో స్కూల్‌కు ఇచ్చే మొత్తం	విడుదలైన నిధులు
1 నుంచి 30	1032	రూ.2 వేలు	రూ.20,64,000
30 నుంచి 100	596	రూ.5 వేలు	రూ.29,80,000
100 నుంచి 250	252	రూ.10 వేలు	రూ.25,20,000
250 నుంచి వెయ్యి	129	రూ.15 వేలు	రూ.19,35,000
1000	04	రూ.20 వేలు	రూ. 80,000

సక్రమంగా వినియోగించుకోవాలి



పాఠశాల అవసరాలకు అనుగుణంగా ప్రభుత్వం రెండో విడత మెయింటెనెన్స్ గ్రాంటును విడుదల చేసింది. దీంతోపాటు టాయిలెట్స్ మెయింటెన్స్ గ్రాంటును కూడా ఇస్తుంది. ఈ నిధులను ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా సక్రమంగా వినియోగించి విద్యార్థుల విద్యాభివృద్ధికి కృషి చేయాలి. వీటితోపాటు ఖర్చు చేసిన నిధులకు సంబంధించిన బిల్లులను గడువులోపు సంబంధింత అధికారులకు సమర్పించాలి. ఇందులో ఎవరు కూడా నిర్లక్ష్యం ప్రదర్శించరాదు. – అంబవరం ప్రభాకర్‌రెడ్డి, సమగ్రశిక్ష జిల్లా ప్రాజెక్టు అధికారి

వేమన జాడలో.. విశ్వవెలుగుల నీడలో..

- నేడు వైవీయూ 17వ వ్యవస్థాపక దినోత్సవం
- ముఖ్యఅతిథిగా అమిత్‌కుమార్ పాత్రా
- న్యాక్ 'ఏ' గ్రేడ్ సాధించిన తర్వాత తొలి వేడుకలు



వైవీయూ ముఖద్వారం

వైవీయూ : యోగివేమన నీకు వందనం.. విశ్వకవి తాత్వికా నీకు వందనం.. అన్న ఉద్దీపన గీతంతో ఉత్తేజితులవుతూ.. సామాజిక స్పృహ కల్పించిన ప్రజాకవి పేరుతో ఏర్పాటైన యోగివేమన విశ్వవిద్యాలయం 17వ వ్యవస్థాపక, వార్షికోత్సవ వేడుకలకు సిద్ధమైంది. 2006 మార్చి 9వ తేదీన పీజీ కేంద్రం నుంచి విశ్వవిద్యాలయంగా రూపాంతరం చెంది నేడు 27 కోర్సులతో విలసిల్లుతోంది. దాదాపు 1500 మందికి పైగా విద్యార్థులు 100 మంది అధ్యాపక బృందం, 300 మంది దాకా బోధనేతర సిబ్బంది, 100మంది పైగా పరిశోధక విద్యార్థులతో ప్రగతిపథంలో దూసుకువెళ్తోంది.

- 1977 నవంబర్ 20వ తేదీన తిరుపతి శ్రీవెంకటేశ్వర విశ్వవిద్యాలయం కడప నగరానికి సమీపంలో పీజీ సెంటర్‌ను ఏర్పాటు చేసింది. డా. వైఎస్ రాజశేఖరరెడ్డి ముఖ్యమంత్రి అయ్యాక 2006లో 652 ఎకరాల్లో విశ్వవిద్యాలయంగా రూపుదిద్దుకుంది.

అభివృద్ధికి అడుగులు.. ఇలా...

యోగివేమన విశ్వవిద్యాలయాన్ని ప్రారంభించిన వైఎస్‌ఆర్ ..విశ్వవిద్యాలయానికి నిధుల వరద పారించారు. వైవీయూకు 2012లో 12బీ గుర్తింపు సైతం లభించడంతో పాటు పలు ప్రతిష్టాత్మక ప్రాజెక్టులు, యంగ్ సైంటిస్టు అవార్డులను విశ్వవిద్యాలయ అధ్యాపక బృందం సొంతం చేసుకున్నారు. అదే విధంగా 2022 నవంబర్‌లో విశ్వవిద్యాలయం న్యాక్ ఏ గ్రేడ్ సాధించి సత్తాచాటింది. కాగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి వైవీయూ పరిధిలోని ప్రొద్దుటూరు వైఎస్‌ఆర్ ఇంజినీరింగ్ కళాశాలకు రూ. 66 కోట్లు, సీపీ బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రానికి రూ.5.5 కోట్లు నిధులు మంజూరు చేశారు.

- విశ్వవిద్యాలయం 2022 ఎన్‌ఐఆర్‌ఎఫ్ ర్యాంకింగ్‌లో దేశంలోని అత్యుత్తమ విద్యాలయాల్లో 101 నుంచి 150లోపు స్థానం సాధించింది. దీంతో పాటు వైఎస్‌ఆర్ జీవిత సాఫల్య పురస్కారం పొందింది. కేంద్ర ప్రభుత్వం నేషనల్ రూరల్ ఎంటర్‌ప్రెన్యూషిప్ మిషన్ ద్వారా ఐఎస్‌ఓ 9001, 2015 సర్టిఫికెట్, పర్యావరణ పరిరక్షణ కోసం చేపట్టిన చర్యల ద్వారా ఐఎస్‌ఓ 14001.. 2015 సర్టిఫికెట్ సాధించారు. దీంతో పాటు ఏపీ స్టేట్ బయోడైవర్సిటీ కన్జర్వేషన్ అవార్డు సాధించింది. వీటితో పాటు పలు అవార్డులు, పలు ప్రాజెక్టులు సొంతం చేసుకుని అభివృద్ధి బాటలో పయనిస్తోంది.

నేడు వ్యవస్థాపక దినోత్సవ వేడుకలు

న్యాక్ ఏ గ్రేడ్ సాధించిన తర్వాత సరికొత్త హంగులతో విలసిల్లుతున్న విశ్వవిద్యాలయంలో గురువారం ఉదయం 10.30 గంటలకు వైవీయూలో 17వ వ్యవస్థాపక, కళాశాల దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించనున్నారు. విశ్వవిద్యాలయ వైస్ చాన్సలర్ ఆచార్య జింకా రంగజనార్ధన ఆధ్వర్యంలో నిర్వహించే ఈ వేడుకలకు ముఖ్యఅతిథిగా గాదంలోని జాతీయ వాతావరణ పరిశోధన ప్రయోగశాల, అంతరిక్ష విభాగం డైరెక్టర్ అమిత్‌కుమార్ పాత్రా విచ్చేయనున్నారు. విశ్వవిద్యాలయ రిజిస్ట్రార్ ఆచార్య వై.పి. వెంకటసుబ్బయ్య, ప్రిన్సిపాల్ ఆచార్య కె. కృష్ణారెడ్డి నేతృత్వంలో వేడుకలను ఘనంగా నిర్వహించేందుకు ఇప్పటికే ఏర్పాట్లు పూర్తి చేశారు.

న్యూస్‌రీల్

నేటి నుంచి వెటరన్ క్రికెట్ టోర్నమెంట్



వైఎస్ రాజారెడ్డి-ఏసీఏ క్రికెట్ మైదానం

కడప స్పోర్ట్స్: కడప నగరంలోని వైఎస్ రాజారెడ్డి-ఏసీఏ క్రికెట్ మైదానం వేదికగా వెటరన్ టీ-20 క్రికెట్ టోర్నమెంట్ నిర్వహించనున్నట్లు క్రికెట్ అసోసియేషన్ ఆఫ్ వైఎస్‌ఆర్ డిస్ట్రిక్ట్ కార్యదర్శి అవ్వారు రెడ్డిప్రసాద్ తెలిపారు. ఈనెల 9 నుంచి 12వ తేదీ వరకు ప్రతిరోజూ ఉదయం 9 గంటలకు, మధ్యాహ్నం 1 గంటకు రెండుచొప్పున మ్యాచ్‌లు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ టోర్నమెంట్‌లో హైదరాబాద్, కడప, విజయవాడ, అనంతపురం, గోవా, నెల్లూరు జట్లు తలపడనున్నట్లు తెలిపారు.

కడప మీదుగా వేలాంగిణికి స్పెషల్ బస్సు



కడప కోటిరెడ్డిసర్కిల్: మైదుకూరు డిపో నుంచి తమిళనాడులోని వేలాంగిణి-నాగపట్నంకు ఈనెల 11వ తేదీ స్పెషల్ బస్సును నడపనున్నట్లు కడప ఆర్టీసీ ఆర్‌ఎం గోపాల్ రెడ్డి తెలిపారు. 11వ తేదీ సాయంత్రం 4 గంటలకు మైదుకూరులో బయలుదేరి కడపకు 5.30 గంటలకు చేరుకొని మరుసటి రోజు ఉదయం 6గంటలకు వేలాంగిణికి చేరుకుంటుందన్నారు. తిరిగి 12వ తేది సాయంత్రం వేలాంగిణిలో బయలుదేరి మరుసటి రోజు ఉదయం 6 గంటలకు మైదుకూరుకు చేరుకుంటుందని ఆయన తెలిపారు. మైదుకూరు నుంచి రూ.1980, కడప నుంచి రూ.1950లుగా రానుపోను టిక్కెట్ ధరగా నిర్ణయించామన్నారు. ఆన్‌లైన్‌లోగాని, బస్ స్టేషనలో గాని రిజర్వేషన్ చేసుకోవచ్చని ఆయన వివరించారు. ఇతర వివరాలకు డీఎం. 9959225781, ఎస్‌టిఐ 9494755057 లను సంప్రదించవచ్చన్నారు.

పొలతలలో హుండీ కానుకల లెక్కింపు



పొలతలలో హుండీ కానుకలను లెక్కిస్తున్న ఆలయ సిబ్బంది, భక్తులు

పెండ్లిమర్రి: మహా శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని పొలతల క్షేత్రంలో శాశ్వతంగా ఏర్పాటు చేసిన హుండీల ఆదాయాన్ని బుధవారం దేవాదాయశాఖ ఇన్‌స్పెక్టర్ జనార్ధన్, ఆలయ ఛైర్మన్ రాజగోపాల్‌రెడ్డి, ఈఓ మహేశ్వర్‌రెడ్డిల ఆధ్వర్యంలో లెక్కింపు నిర్వహించారు. విడిదినాలు, ఉత్సవాల మూడు రోజులకు గానూ మల్లేశ్వరస్వామి, పార్వతిదేవి, అక్కదేవతలు, పులిబండెన్న స్వాములవారి హుండీ కానుకలను లెక్కించగా రూ.33,60,982 లక్షలు నగదు లభించిందన్నారు.

పదిలో వందశాతం ఉత్తీర్ణత సాధించేందుకు కృషి



సమావేశంలో మాట్లాడుతున్న డీఈఓ దేవరాజు

కడప ఎడ్యుకేషన్: పది ఫలితాల్లో ప్రవేటు పాఠశాలల్లో వందశాతం ఉత్తీర్ణతను సాధించేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని డీఈఓ దేవరాజు సూచించారు. కడపలోని వైఎస్సార్ ఆడిటోరియంలో అన్ ఎయిడెట్ స్కూల్స్ మేనేజ్‌మెంట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో 10వ తరగతి విద్యార్థులకు పరీక్షలపై అవగాహన సదస్సును నిర్వహించారు. డీఈఓ దేవరాజు మాట్లాడుతూ పది పరీక్షలు వచ్చే నెల 3వ తేదీ నుంచి ప్రారంభం అవుతాయన్నారు. ప్రతి పాఠశాలలో వందశాతం ఉత్తీర్ణతను సాధించేందుకు ఆయా పాఠశాలల కరస్పాండెంట్లు చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లా సైన్సు అధికారి మహేశ్వరెడ్డి, బైజ్యూస్ రాష్ట్ర కో ఆర్డినేటర్ రెహమాన్, ఇంగ్లీష్ సబ్జెక్టు నిపుణులు గునిపాటి శ్రీనివాసులు, ప్రొఫెసర్ సునీత, అన్ ఎయిడెడ్ స్కూల్స్ మేనేజ్‌మెంట్ అసోసియేషన్ అధ్యక్షులు శ్రీనివాసులరెడ్డి పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో మహిళలకు అగ్రపీఠం

- ఉప ముఖ్యమంత్రి అంజద్‌బాషా
- వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో ఘనంగా మహిళా దినోత్సవం



మహిళా నేతలను సత్కరిస్తున్న డిప్యూటీ సీఎం అంజద్‌బాషా, మేయర్ సురేష్‌బాబు

కడప కార్పొరేషన్: వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో మహిళలకు అగ్రపీఠం వేయడం జరుగుతోందని ఉప ముఖ్యమంత్రి అంజద్‌బాషా అన్నారు. మహిళా దినోత్సవ వేడుకలు మంగళవారం స్థానిక వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి డిప్యూటీ సీఎంతోపాటు మేయర్ సురేష్ బాబు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి, వివిధ రంగాల్లో రాణించిన మహిళలను ఘనంగా సత్కరించారు.

- ఈ సందర్భంగా డిప్యూటీ సీఎం అంజద్‌బాషా మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మహిళా పక్షపాతిగా అన్ని సంక్షేమ పథకాలు మహిళల పేరుమీదనే ఇస్తున్నారని తెలిపారు. విద్య, ఉద్యోగ, ఉపాధి అవకాశాల్లో మహిళలకు పెద్దపీట వేసి 50 శాతం రిజర్వేషన్ ఇస్తున్నారని తెలిపారు. ప్రభుత్వం ఇచ్చిన అన్ని నామినేటెడ్ పదవుల్లోనూ మహిళలకు 50 శాతం రిజర్వేషన్ కల్పించారన్నారు. ప్రభుత్వంలో అత్యంత కీలకమైన హోం శాఖను రెండు సార్లు మహిళలకే కేటాయించారన్నారు.
- మేయర్ సురేష్ బాబు మాట్లాడుతూ మహిళా సంక్షేమంతో పాటు మహిళల భద్రత, రక్షణ కోసం జగనన్న ప్రభుత్వం దిశ చట్టాన్ని తెచ్చిందన్నారు. మహిళలపై దాడులు, దారుణాలకు ఒడిగట్టేవారికి కఠిన శిక్షలు పడేలా చర్యలు తీసుకోవడం జరుగుతోందని వివరించారు.
- వైఎస్సార్‌సీపీ మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు ఉషారాణి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం భర్తీ చేసిన వార్డు సచివాలయ కార్యదర్శులు, వలంటీర్లు, వైద్య, ఆరోగ్య శాఖ పోస్టుల్లో మహిళలకు 50 శాతం రిజర్వేషన్ కల్పించి మహిళల పట్ల ఉన్న గౌరవాన్ని ప్రభుత్వం చాటుకుందని తెలిపారు.
- అనంతరం మహిళలకు మ్యూజికల్ చైర్స్, లెమన్ అండ్ స్పూన్ వంటి పోటీలు నిర్వహించి, అందులో గెలిచిన వారికి ఎమ్మెల్యే పి. రవీంద్రనాథ్‌రెడ్డి సతీమణి అరుణమ్మ చేతుల మీదుగా బహుమతులు అందజేశారు.
- ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి అఫ్జల్‌ఖాన్, డిప్యూటీ మేయర్లు ముంతాజ్ బేగం, బి. నిత్యానందరెడ్డి, మహిళా నేతలు పత్తిరాజేశ్వరి, టీపీ వెంకట సుబ్బమ్మ, బండి మరియలు, రత్నకుమారి, సంధ్యారాణి, బండి జయమ్మ, శ్రీలక్ష్మి, క్రిష్ణవేణి, ఏపీ సోషల్ వెల్ఫేర్ బోర్డు ఛైర్మెన్ పులి సునీల్‌కుమార్, హఫీజుల్లా, సీహెచ్ వినోద్, బంగారు నాగయ్య, షఫీ, సమరనాథరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మహిళా సాధికారతే ప్రభుత్వ ధ్యేయం

ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి



మహిళా దినోత్సవం సందర్భంగా కేక్ కట్ చేస్తున్న ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి, తదితరులు

పులివెందుల : మహిళా సాధికారతకు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తోందని కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి పేర్కొన్నారు. బుధవారం ప్రపంచ మహిళా దినోత్సవం సందర్భంగా స్థానిక భాకరాపురంలోని వైఎస్సార్ ఆడిటోరియంలో మహిళలతో కలిసి ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మహిళలందరికీ అంతర్జాతీయ మహిళా దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగనన్న మహిళలను ఎంతో ప్రోత్సహిస్తూ మహిళా సాధికారత కోసం అనేక పథకాలను ప్రవేశపెట్టారన్నారు. చట్టసభలలో మహిళలకు అధిక ప్రాధాన్యత ఇచ్చారన్నారు. మహిళల భద్రత కోసం దిశా పోలీస్‌స్టేషన్లు, ప్రత్యేక యాప్‌లను రూపొందించారన్నారు. కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ హేమలత, వైఎస్సార్‌సీపీకి చెందిన మహిళా నాయకులు పాల్గొన్నారు.

మాతృమూర్తికే అగ్రస్థానం: ఎస్పీ కేకేఎన్ అన్బురాజన్



అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా కేక్ కట్ చేయిస్తున్న జిల్లా ఎస్పీ కేకేఎన్ అన్బురాజన్

కడప అర్బన్: సమాజంలో మాతృమూర్తికే అగ్రస్థానమని, సహనం, ఓర్పు, ధైర్యంతో కుటుంబాన్ని, తద్వారా సమాజాన్ని, దేశాన్ని అగ్రస్థానంలో నిలపడంలో మహిళ పాత్ర అమోఘమని ఎస్పీ కేకేఎన్ అన్బురాజన్ పేర్కొన్నారు. బుధవారం అంతర్జాతీయ మహిళాదినోత్సవం సందర్భంగా స్థానిక 'పెన్నార్' పోలీస్ కాన్ఫరెన్స్ హాల్‌లో జిల్లా పోలీసుశాఖ ఆధ్వర్యంలో ప్రత్యేకంగా కార్యక్రమం నిర్వహించారు. విశిష్ట సేవలందించిన మహిళా పోలీసు అధికారులు, గ్రామ,వార్డు మహిళా పోలీసు సిబ్బందికి ప్రశంసాపత్రాలను అందజేసి సన్మానించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ ప్రత్యేకంగా రూపొందించిన కేక్ కట్ చేయించి శుభాకాంక్షలు తెలిపారు.

- సన్మానం పొందిన వారిలో ఎస్‌ఈబీ అదనపు ఎస్పీ పూజిత నీలం, వైద్యులు మమతేశ్వరి , రేఖారావు, హిమబిందు, పావని, శ్రీమాధుర్య, మేరీ సుజాత, డీవీసీ కౌన్సిలర్ పర్వీన్‌నాజ్, భారతరత్న మహిళా మండలి అధ్యక్షురాలు మూలే సరస్వతి, మహిళా పోలీసు మున్వర్ సుల్తానా, డీఎల్ఎస్ఏ ప్యానల్ లాయర్ ఎం. చంద్రకాంతమ్మ తదితరులు వున్నారు.
- ఈ కార్యక్రమం అనంతరం పోలీస్ సంక్షేమ వైద్యశాలలో వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు.
- యువదర్శకుడు బాల ఆధ్వర్యంలో 'స్ఫూర్తి' పేరుతో మహిళల భద్రతకు పోలీస్ శాఖ చేస్తున్న కృషి, పనితీరును రూపొందించిన షార్ట్ ఫిలింను ఎస్పీ ఆవిష్కరించారు.
- ఈ కార్యక్రమాల్లో ఏఆర్ అదనపు ఎస్పీ ఎస్.ఎ స్.ఎస్.వి. కృష్ణారావు, ఏఆర్ డీఎస్పీ రమణయ్య, 'దిశ' డీఎస్పీ వాసుదేవన్, కడప డీఎస్పీ బి. వెంకటశివారెడ్డి, దిశ ఇన్‌స్పెక్టర్ వినయ్‌కుమార్ రెడ్డి, ఆర్ఐలు వీరేష్, సోమశేఖర్‌నాయక్, కడప నగరంలోని సీఐలు, పోలీసు అధికారుల సంఘం జిల్లా అధ్యక్షుడు దూలం సురేష్ తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్ పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలి

ఇంటర్ ఆర్జేడీ రవి



సమావేశంలో మాట్లాడుతున్న ఇంటర్ ఆర్జేడీ రవి

కడప ఎడ్యుకేషన్: జిల్లావ్యాప్తంగా ఈనెల 15వ తేదీ నుంచి ప్రారంభంకానున్న ఇంటర్మీడియట్ పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాల ని ఇంటర్మీడియట్ ఆర్జేడీ రవి పేర్కొన్నారు. బుధవారం కడపలోని సెయింట్ జోసెఫ్ జూనియర్ కళాశాలలో ఇంటర్ ఆర్ఐఓ రమణరాజు ఆధ్వర్యంలో చీఫ్ సూపరింటెండెంట్లు, డిపార్టుమెంట్ ఆఫీసర్లకు పరీక్షల నిర్వహణపై శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్జేడీ రవి మాట్లాడుతూ ఇంటర్ పరీక్షల కోసం ఉమ్మడి జిల్లావ్యాప్తంగా 92 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. పరీక్షలను ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు నిర్వహిస్తామన్నారు. ఇంటర్ ఆర్ఐఓ రమణరాజు మాట్లాడుతూ హాల్ టికెట్లను ఆయా కళాశాలలకు చేరవేశామన్నారు. ఇబ్బందులుంటే కంట్రోల్ రూం నెంబర్ 08562 -244171 ఫోన్ చేయాలన్నారు. డీవీఈఓ శ్రీనివాసులరెడ్డి, డీఈసీ సభ్యులు వెంకటసుబ్బయ్య, ప్రకాష్, సుబ్రమణ్యం, ప్రసాద్‌శర్మ పాల్గొన్నారు.

జమ్మలమడుగు బ్రాంచి మేనేజర్‌కు ఉత్తమ అవార్డు



కడప అగ్రికల్చర్: వైఎస్సార్ జిల్లా కడప డీసీసీ బ్యాంకు పరిధిలోని జమ్మలమడుగు బ్రాంచి మేనేజర్ లక్ష్మి ఉత్తమ బ్రాంచి మేనేజర్ అవార్డుకు ఎంపికయ్యారు. ఈ మేరకు బుధవారం విజయవాడలో ఆప్‌కాబ్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ స్పెషల్ ఛీఫ్ సెక్రటరీ పూనమ్ మాలకొండయ్య చేతుల మీదుగా ఆమె అవార్డును అందుకున్నారు.

క్లుప్తంగా

వైభవంగా జెండా ఊరేగింపు



ఖవాలీలో పాడుతున్న గాయకులు

రామాపురం : మండలంలోని నీలకంతరావుపేట దర్గాలో మంగళవారం రాత్రి జెండా ఊరేగింపు, ఉరుసు వైభవంగా జరిగింది. చుట్టుపక్కల గ్రామాలకు చెందిన భక్తులు 70–80 అడుగుల పొడవు గల వెదురు బొంగుతో దర్గాకు చేరుకుని తమ మొక్కులు తీర్చుకున్నారు. ఉత్సవాల్లో చివరి రోజు బెంగళూరు, ముంబై నుంచి వచ్చిన గాయకుల ఖవాలీ కార్యక్రమం అందరినీ ఆకట్టుకుంది. కమిటీ సభ్యులు అయూబ్‌అలీఖాన్, జాకీర్‌హుశేన్, ఇనాయతుల్లా, మహబూబ్‌బాష, జావీద్, జాకీర్, ఖతీబ్, జాఫర్, మత పెద్దల ఆధ్వర్యంలో ఉరుసు ఉత్సవాలు జరిగాయి.

రేషన్ బియ్యం స్వాధీనం



స్వాధీనం చేసుకున్న బియ్యం, నిందితులతో విజిలెన్స్–ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు

సింహాద్రిపురం : సింహాద్రిపురం, కొండాపురం, తొండూరు, మండలాల్లోని రేషన్ బియ్యాన్ని రావులకొలను వద్ద డంప్ చేసుకుని లారీకి లోడు చేస్తున్న సమయంలో బుధవారం విజిలెన్స్–ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు రామకృష్ణ, శ్రీనివాసులు, మండల ఆర్ఐ షేక్షాలు దాడి చేసి స్వాధీనం చేసుకున్నారు. కొండాపురానికి చెందిన విశ్వనాథ్, సత్యసాయి జిల్లా ధర్మవరానికి చెందిన బాలచంద్రలు మూడు మండలాల్లో 10టన్నుల కుపైగా రేషన్ బియ్యాన్ని సేకరించారు. రావులకొలను పొలాల్లో డంప్ చేశారు. ఐచర్ వాహనంలో లోడు చేస్తుండగా పట్టుకున్నారు. వాహనాన్ని సీజ్ చేశారు. ఇద్దరు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నారు. రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకుని స్థానిక పోలీస్‌స్టేషన్‌లో అప్పగించారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి తీవ్రగాయాలు



గాయపడిన నాగరాజు

ఒంటిమిట్ట : మండల పరిధిలోని మంటపంపల్లె రైల్వే గేట్ సమీపం వద్ద మంగళవారం అర్ధరాత్రి రోడ్డు ప్రమాదం జరిగింది. ఈ ఘటనలో ఆటో డ్రైవర్ నాగరాజు(56)కు తీవ్రగాయాలయ్యాయి. ఒంటిమిట్ట ఎస్ఐ మధుసూదన్ రావు బుధవారం వివరాలు వెల్లడించారు. కడపకు చెందిన నాగరాజు ఆటో తోలుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. మంగళవారం రాత్రి పని నిమిత్తం ఆటోలో రాజంపేటకు వచ్చాడు. తిరిగి కడపకు వెళుతుండగా మంగళవారం అర్ధరాత్రి 12:30 నిమిషాలకు మంటపంపల్లె రైల్వే గేట్ సమీపంలోని జాతీయ రహదారిపై గుర్తు తెలియని వాహనం వచ్చి ఢీ కొంది. ఈ ప్రమాదంలో నాగరాజుకు తీవ్రగాయాలయ్యాయి. విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకున్నారు. క్షతగాత్రుడిని 108 వాహనంలో కడప రిమ్స్‌కు తరలించారు. కేసు నమోదు చేసి విచారిస్తున్నామని ఎస్ఐ తెలిపారు.

పాపం...ప్రవీణ్

- ఉదయం ఆరు నుంచి సాయంత్రం ఆరు వరకు చూడలేని పరిస్థితి
- రూ.లక్షల్లో వైద్య ఖర్చులు
- ఆదుకోవాలని తల్లిదండ్రుల వేడుకోలు



వెలుగు చూడలేక కంటికి చేయిని అడ్డు పెట్టుకున్న ప్రవీణ్ నాయక్

చింతకొమ్మదిన్నె : ఈ చిన్నారి పేరు మూడె ప్రవీణ్ నాయక్. వయస్సు 12 సంవత్సరాలు. తల్లిదండ్రులు మోహన్ నాయక్, గంగోజమ్మ వీరు చింతకొమ్మదిన్నె మండలం ఏఎల్ కాలనీలో నివసిస్తున్న నిరుపేదలు. గంగోజమ్మ అనారోగ్యంతో మంచంలో ఉంది. మోహన్ నాయక్ కూ చేసుకుంటూ మంచాన ఉన్న భార్యను, అటు కళ్లు కనిపించని కుమారున్ని చూసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. చాలీ చాలని కూలి డబ్బులతోనే ఆ రోజు గడపాల్సి ఉంటుంది. కాగా ప్రవీణ్ జన్మించి 12 సంవత్సరాలు అవుతోంది. మొదట ఒక ఏడాది ఆ చిన్నారి కంటి చూపు అందరిలాగానే ఉండేది. తర్వాత ఏమి జరిగిందో ఏమో తెలియదు ఉదయం 6 నుంచి సాయంత్రం 6 గంటల వరకు కళ్లు కనిపించవు. అందరికి చీకటి సమస్య అయితే ఈ చిన్నారికి మాత్రం వెలుగు శాపంగా మారింది. సూర్యుడి కిరణాలు భూమి మీద పడే కొద్ది చూపు కోల్పోవడం జరుగుతుంది. ఇలా సాయంత్రం ఆరు గంటల వరకు అంధుడిలా ఉండాల్సి పరిస్థితి ఏర్పడింది. తోటి చిన్నారులతో ఆడుకోవడానికి, స్కూల్ వెళ్లలేని పరిస్థితి ప్రవీణ్‌ది. మాటలను బట్టి తల్లిదండ్రులా..మరెవరైనా అని ఆ బాలుడు గుర్తించగలడు. సాయంత్రం ఆరు నుంచి తెల్లవారు జామున వరకు చూపు అందరి లాగానే ఉంటుంది. తమ కుమారుడికి ఏ జబ్బు వచ్చిందో అర్థ కాక తల్లిదండ్రులు వ్యయప్రయాసలకోర్చి మధురైకి వెళ్లారు. అక్కడ పరీక్షించిన వైద్యులు కంటి నరాలు బలహీనంగా ఉన్నాయని, జబ్బు నయం చేయడానికి వైద్యానికి రూ 8.50 లక్షలు ఖర్చు అవుతుందని తెలిపారు. అంతే కాక ఈ వ్యాధికి ఆరోగ్య శ్రీ కూడా వర్తించక పోవడంతో ఆ తల్లిదండ్రుల పరిస్థితి అగమ్య గోచరంగా మారింది. తర్వాత హైదరాబాద్, కర్నూలు తదితర ప్రాంతాల్లోని వైద్యులకు చూపించినా వారు కూడా అదే అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. దీంతో చికిత్సకు ఆర్థికస్థోమత లేక, దాతల ఆసరా కోసం ఎదురు చూస్తున్నారు. దాతలు దయతలిచి తమ బిడ్డ జీవితంలో వెలుగులు నింపాలని అభ్యర్థిస్తున్నారు.

చూపును ప్రసాదించండి..

తనకు చూపును ప్రసాదించాలని చిన్నారి ప్రవీణ్ నాయక్ వేడుకుంటున్నాడు. తనకు చూపు వస్తే కష్టపడి చదివి పది మందికి సహాయ పడతానని అంటున్నాడు. కాగా తమ బిడ్డను ఆదుకోవడానికి 83743 04458 నంబర్‌లో సంప్రదించాలని అన్నారు. ఆర్థిక సాయం చేసే వారు బ్యాంక్ ఖాతా నంబర్ ఆంధ్రా బ్యాంక్ : 029210100079724 కు పంపించాలని వేడుకుంటున్నారు.

బీడీ తెచ్చిన తంటా..

- గ్యాస్ ప్రమాదంతో ఇంట్లో మంటలు
- రెండు ఇళ్ల పైకప్పు ధ్వంసం
- ఒకరికి తీవ్ర గాయాలు





ప్రమాదంలో ధ్వంసమైన ఇళ్ల పైకప్పు (ఇన్‌సెట్) తీవ్రంగా గాయపడిన రసూల్

ప్రొద్దుటూరు క్రైం : అతను రాత్రి పొద్దుపోయాక పడుకున్నాడు. నిద్ర పట్టక పోవడంతో బీడీ తాగేందుకు అగ్గిపుల్ల వెలిగించాడు. దీంతో ఒక్కసారిగా పెద్ద శబ్దంతో ఇంట్లో మంటలు చెలరేగాయి. ఈ సంఘటనలో అగ్గిపుల్ల వెలిగించిన రసూల్ తీవ్రంగా గాయపడ్డాడు. స్థానిక నడింపల్లెలో గ్యాస్ లీక్ కావడంతో షేక్ రసూల్ అనే వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. పోలీసుల కథనం మేరకు రసూల్ బేల్దార్ పనికి వెళ్తుంటాడు. అతనికి భార్య, కుమారుడు ఉన్నారు. వారు మైదుకూరుకు వెళ్లడంతో కొన్ని రోజుల నుంచి రసూల్ ఒంటరిగా ఉంటున్నాడు. మంగళవారం రాత్రి ఇంటికి వచ్చిన అతను గ్యాస్‌స్టవ్‌పై వంట చేసుకున్నాడు.అన్నం తిని పడుకున్నాడు. సుమారు అర్ధరాత్రి దాటినా నిద్రపట్టకపోవడంతో బుధవారం ఉదయం సుమారు 1.30 సమయంలో బీడీ తాగేందుకు అగ్గిపుల్ల వెలిగించాడు. దీంతో ఒక్కసారిగా ఇళ్లంతా మంటలు వ్యాపించాయి. రసూల్ ఇంటితో పాటు పక్కన ఉన్న మరో ఇంటి రేకులు ధ్వంసమయ్యాయి. రసూల్ శరీరమంతా కాలిపోయింది. వారి ఇంటి ఎదురుగా పై అంతస్తులో ఉన్న ఇంటి పై కప్పు కూడా పాక్షికంగా దెబ్బతింది. గాయ పడిన రసూల్‌ను జిల్లా ఆస్పత్రికి తరలించారు. వైద్యుల సూచన మేరకు మెరుగైన చికిత్స కోసం కడప రిమ్స్‌కు తరలించారు. టూ టౌన్ సీఐ ఇబ్రహీం సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. అతను గ్యాస్ స్టవ్ సరిగా ఆఫ్ చేయకపోవడం వల్లనే ఈ ప్రమాదం జరిగి ఉంటుందని పోలీసులు తెలిపారు. ఇంట్లో మంటలు అలుముకోవడంతో టీవీ, బట్టలు, ఇతర వస్తువులన్నీ కాలిపోయాయి. ప్రస్తుతం రసూల్ ఆస్పత్రిలో కోలుకుంటున్నట్లు సీఐ తెలిపారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామన్నారు.

ఓవర్‌టేక్ చేయబోయి.. స్తంభాన్ని ఢీకొట్టి..

రోడ్డుప్రమాదంలో ఎండీయూ వాహన డ్రైవర్ మృతి



జీవన్‌ప్రకాష్ మృతదేహం



ప్రమాదానికి కారణమైన ద్విచక్రవాహనం

మదనపల్లె : రోడ్డుప్రమాదంలో ఎండీయూ వాహన డ్రైవర్ మృతి చెందిన సంఘటన బుధవారం పట్టణంలో జరిగింది. మండలంలోని కోళ్లబైలు పంచాయతీ బాబూకాలనీకి చెందిన వైఎస్సార్ సీపీ నాయకుడు రెడ్డిశేఖర్ కుమారుడు జీవన్‌ప్రకాష్(25) స్థానికంగా రేషన్‌బియ్యం పంపిణీ చేసే ఎండీయూ వాహనానికి డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. బుధవారం మధ్యాహ్నం సొంతపనులపై పట్టణానికి వచ్చిన జీవన్‌ప్రకాష్ బాబూకాలనీకి వెళుతుండగా కదిరిరోడ్డులోని టిప్పు సుల్తాన్ మైదానం వద్ద ముందు వెళుతున్న వాహనాన్ని ఓవర్‌టేక్ చేసే క్రమంలో అదుపుతప్పి రోడ్డుడివైడర్‌లో ఏర్పాటుచేసిన లైటింగ్ స్తంభాన్ని ఢీకొట్టి కిందపడిపోయాడు. గమనించిన స్థానికులు అతన్ని ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు ప్రమాద స్థలంలోనే జీవన్‌ప్రకాష్ మృతిచెందినట్లుగా నిర్ధారించారు. మృతదేహాన్ని శవపరీక్ష నిమిత్తం మార్చురీకి తరలించారు. వన్‌టౌన్ పోలీసులు కేసు విచారణ చేస్తున్నారు. జీవన్‌ప్రకాష్ తండ్రి రెడ్డిశేఖర్ కోళ్లబైలు పంచాయతీలో వైఎస్సార్ సీపీ నాయకుడిగా ఉన్నారు. కుమారుడికి ప్రమాదం జరిగిన సమయంలో ఎమ్మెల్యే నవాజ్‌బాషాతో పాటు తిరుపతిలో ఓ సమావేశానికి వెళ్లారు. ఎమ్మెల్యే నవాజ్‌బాషా బాధిత కుటుంబాన్ని ఓదార్చి మృతుడి తల్లిదండ్రులు రెడ్డిశేఖర్, ప్రభావతిలకు ధైర్యం చెప్పారు.

• బైక్, కారు ఢీకొని..



ప్రమాద దృశ్యం

రాయచోటిటౌన్ : బైక్, ఇన్నోవా కారు ఢీకొన్న సంఘటనలో ఒకరు మృతి చెందగా మరో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ సంఘటన రాయచోటి పట్టణంలోని మదనపల్లె రోడ్డులో బుధవారం తెల్లవారు జామున 3 గంటల సమయంలో చోటు చేసుకొంది. పోలీసుల కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. రాయచోటి పట్టణానికి చెందిన రెహమాన్ ఆదాన్ (18), బొగ్గల నరేష్ (18) పల్సర్ బైక్‌పై మల్లూరమ్మ జాతరకు బయలుదేరారు. మదనపల్లె మార్గంలో వస్తుండగా ఇన్నోవా కారు (ఏపీ03 బీసీ 1919) వేగంగా వచ్చి ఢీకొంది. ఈ సంఘటనలో బైక్‌పై వెళుతున్న రెహమాన్‌లకు తలకు బలమైన గాయాలయ్యాయి.చికిత్సకు తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. కారు డ్రైవర్ ఒంటేరు రెడ్డి వంశీ, నరేష్ తీవ్రంగా గాయపడ్డారు. క్షతగాత్రులను తిరుపతికి తరలించారు. కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

• గుర్తు తెలియని వాహనం ఢీకొని..



ఆంజనేయులు మృతదేహం

చిన్నమండెం : మండల పరిధిలోని కొత్తపల్లె గ్రామ సమీపంలో గుర్తుతెలియని వాహనం ఢీకొని ఇడగొట్టు రామాంజనేయులు(29) మృతిచెందాడు. కుటుంబసభ్యుల కథనం మేరకు రామాంజనేయులు మంగళవారం రాత్రి ద్విచక్రవాహనంలో మల్లూరమ్మజాతరకు బయలుదేరాడు. మార్గమధ్యలో గుర్తు తెలియని వాహనం ఢీకొంది. రామాంజనేయులు తీవ్రంగా గాయపడ్డాడు. అతన్ని రాయచోటి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. బుధవారం మెరుగైన వైద్యం కోసం తిరపతికి తీసుకెళ్లారు.అక్కడి వైద్యులు పరీక్షించి అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. మృతుడికి భార్య కుమారుడు ఉన్నారు. ఈ విషయంపై పోలీసులతో మాట్లాడగా మాకు ఎలాంటి ఫిర్యాదు అందలేదని తెలిపారు.

వేర్వేరు ప్రాంతాల్లో ఇద్దరు ఆత్మహత్యయత్నం

మదనపల్లె : వేర్వేరు ఘటనల్లో ఇద్దరు వివాహితలు ఆత్మహత్యయత్నానికి పాల్పడ్డారు. వివరాలు అన్నమయ్య జిల్లా కురబలకోట మండలం ముదివేడు క్రాస్‌కు చెందిన ఇమామ్‌సాహెబ్ భార్య ముబీనా (20) కుటుంబ సమస్యల కారణంగా ఆత్మహత్యయత్నానికి పాల్పడింది. భర్త ఏడాది క్రితం జీవనోపాధి కోసం కువైట్‌కు వెళ్లాడు మంగళవారం రాత్రి భార్యతో ఫోన్‌లో మాట్లాడుతూ మందలించాడు. దీంతో ముబీనా ఇంట్లో ఉన్న హార్పిక్ తాగింది. పీటీఎం మండలం బెట్టకొండకు చెందిన కదిరేపతి భార్య రాధమ్మ(35) కుటుంబ సమస్యల కారణంగా పురుగుల మందు తాగింది. కుటుంబసభ్యులు వీరిని ఆస్పత్రికి తరలించారు.

అదృశ్యమై.. శవంగా మారి



వెంకటరమణ (ఫైల్)

లక్కిరెడ్డిపల్లి : లక్కిరెడ్డిపల్లె మండలం మద్దిరేవుల గ్రామం, ఈడిగపల్లికి చెందిన తుమ్మల వెంకటరమణ (75) గత నెల 14వ తేదీ తెల్లవారుజామున 3 గంటల నుంచి కనిపించలేదు. ఆయనకు మతిస్థిమితం లేదని కుటుంబీకులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు ఎస్ఐ వినోద్ కుమార్ మిస్సింగ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. బుధవారం ఉదయం 11 గంటల సమయంలో ఊరికి కిలోమీటరు దూరంలో ఏపుగా పెరిగిన గడ్డిలో కుళ్లిన శవం ఉందని గ్రామస్తులు సమాచారం ఇచ్చారు. కుటుంబ సభ్యులు వెళ్లి పరిశీలించారు. కుళ్లిన శవం తుమ్మల వెంకటరమణదని నిర్ధారించుకున్నారు. పోలీసులకు విషయం తెలియజేశారు. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పరిశీలించారు. బంధువుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని, ప్రభుత్వ డాక్టర్‌తో పంచనామ చేసిన అనంతరం మృతదేహాన్ని బంధువులకు అప్పచెబుతామని ఎస్ఐ తెలిపారు.

కార్లు ఢీ : త్రుటిలో తప్పిన ప్రమాదం



నుజ్జునుజ్జయిన కార్లు

ఓబులవారిపల్లె : మంగంపేట జాతీయ రహదారి బొమ్మవరం క్రాస్‌రోడ్డు వద్ద బుధవారం రెండు కార్లు వేగంగా ఢీకొన్నాయి.ప్రమాదం జరిగినపుడు బెలూన్లు ఓపెన్ కావడంతో అందులో ప్రయాణిస్తున్న వారికి ప్రమాదం జరగలేదు. కార్లు నుజ్జు నుజ్జయ్యాయి. రహదారిపై కొద్దిసేపు ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. రెండు కార్లకు చేందిన వారు రాజంపేటకు చెందిన వారని, పూర్తి వివరాలు తెలియాల్సి ఉందని పోలీసులు తెలిపారు.

ఎర్రచందనం దుంగలు స్వాధీనం



స్వాధీనం చేసుకున్న దుంగలతో ఫారెస్ట్ అధికారులు

పీలేరు(అన్నమయ్య జిల్లా) : వాహనంతో సహా రూ. 15 లక్షల విలువైన ఎర్రచందనం దుంగలు స్వాధీనం చేసుకున్నట్లు ఎఫ్ఆర్‌వో వెంకటరమణ తెలిపారు. వివరాలిలా ఉన్నాయి. చిత్తూరు జిల్లా గంగవరం మార్గంలో ఎర్రచందనం తరలిస్తున్నారన్న సమాచారంతో అటవీ సిబ్బంది గంగవరం చెక్‌పోస్టు వద్ద నిఘా ఉంచారు. బుధవారం ఉదయం వాహనాలు తనిఖీ చేస్తుండగా అతివేగంగా వచ్చిన ఇన్నోవా వాహనాన్ని సిబ్బంది ఆపేందుకు ప్రయత్నించారు. అయితే డ్రైవర్ ఆపకుండా ముందుకు పోవడంతో ఫారెస్ట్ సిబ్బంది వెంబడించారు. డ్రైవర్ వాహనాన్ని పలమనేరు పోలీస్‌స్టేషన్ సమీపంలో రోడ్డుపక్కన ఆపి పరారయ్యాడు. సిబ్బంది వాహనాన్ని పరిశీలించగా ఎర్రచందనం దుంగలు ఉన్నట్లు గుర్తించారు. వాహనం, 291 కేజీల బరువుగల 9 ఎర్రచందనం దుంగల విలువ సుమారు రూ. 15 లక్షలు ఉంటుందని ఎఫ్ఆర్‌వో తెలిపారు. అటవీ సిబ్బంది ప్రతాప్, కుప్పుస్వామి, ప్రభుతేజ, చరణ్ పాల్గొన్నారు.

ఆక్రమణదారులకు మరోసారి నోటీసులు జారీ చేస్తాం



విచారణకు హాజరైన నోటీసుదారుల బంధువులు

సిద్దవటం : మండలంలోని ఉప్పరపల్లె గ్రామ సర్వే నెంబర్ 936/ఏ లోని ప్రభుత్వ స్థలంలో షాపింగ్ మాల్ నిర్వహించిన వారికి జారీచేసిన నోటీసులకు సంబంధించి వ్యాపారులు కాకుండా వారి బంధువులు విచారణకు హాజరైతే ఎలా అని, వారికి రెండోసారి నోటీసులు జారీ చేస్తామని తహసీల్దారు శంకర్‌రావు అన్నారు. బుధవారం ఆయన మాట్లాడుతూ ఇక్కడి ప్రభుత్వ భూమిలో గతంలో కొందరికి ఇంటి పట్టాలు ఇచ్చామని, వాటిని అన్యాక్రాంతం చేసి కొందరు షాపింగ్ మాల్స్ నిర్మించారన్నారు. దీంతో వీఆర్‌ఓను, సచివాలయ సర్వేయర్‌లతో క్షేత్ర స్థాయిలో పరిశీలించి ఆక్రమణదారులు 10 మందిని గుర్తించి వారికి నోటీసులు ఇచ్చామన్నారు. బుధవారం విచారణకు సిద్దవటం రెవెన్యూ కార్యాలయానికి హాజరుకావాలని వారికి చెప్పగా కేవలం ముగ్గురు మాత్రమే వచ్చారన్నారు. వారంతా నోటీసుదారుల తరపున బంధువులు అని తెలిపారు. ఆక్రమణదారులకు మరోసారి నోటీసులు జారీ చేస్తామన్నారు. తదుపరి విచారణకు నోటీసుదారులు డాక్యుమెంట్లను తీసుకురావాలని ఆయన తెలిపారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దారు రాజేష్‌కృష్ణ, వీఆర్‌ఓ గౌస్ తదితరులు పాల్గొన్నారు.

పేకాట స్థావరంపై పోలీసు దాడి

- రూ.1,52,310 నగదు స్వాధీనం
- నలుగురు అరెస్ట్



నగదు, పేక ముక్కలు స్వాధీనం చేసుకుంటున్న పోలీసులు

బి.కొత్తకోట(అన్నమయ్య జిల్లా) : స్థానికంగా కొంతకాలంగా గుట్టు చప్పుడు కాకుండా సాగుతున్న పేకాట స్థావరంపై ఎస్ఐ రామమోహన్ ఆధ్వర్యంలో బుధవారం రాత్రి పోలీసులు దాడి చేశారు. భారీగా నగదు స్వాధీనం చేసుకున్నారు. స్థానిక పీటీఎం రోడ్డులోని జెడ్పీ బాలుర హైస్కూల్ సమీపంలోని ఓ ఇంటిలో కొంతకాలంగా రోజూ పెద్ద మొత్తంలో పేకాట ఆడుతున్నట్టు పోలీసులకు సమాచారం ఉంది. కొన్నిరోజుల క్రితం ఆకస్మిక దాడి చేసేందుకు పోలీసులు వెళ్లగా ఈ విషయం జూదరులకు తెలియడంతో తప్పించుకున్నారు. బుధవారం అందిన పక్కా సమాచారంతో ఎస్ఐ రామమోహన్ సిబ్బందితో కలిసి దాడి చేయగా జూదరులు పట్టుబడ్డారు. పేకాట ఆడుతున్న నలుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నారు. రూ.1,52,130 నగదును స్వాధీనం చేసుకున్నారు. అరెస్ట్ చేసిన నలుగురిని గురువారం మదనపల్లె కోర్టులో హాజరుపరుస్తున్నట్టు ఎస్ఐ రామమోహన్ తెలిపారు. కాగా నెలరోజులుగా ఎస్ఐ ఇతరా ప్రాంతాల్లో విధులకు వెళ్తుండటంతో జూదరులు ఇదే అదనుగా భావించి పెద్ద మొత్తంలో పేకాట జూదాలు జోరుగా నిర్వహిస్తున్నారు. మండలంలో పేకాట జూదం ఆడుతున్నట్టు సమాచారం అందితే దాడులు చేస్తామని ఎస్ఐ తెలిపారు.

యువకుడిపై పోక్సో కేసు

మదనపల్లె : ప్రేమ పేరుతో మైనర్‌బాలికను మోసగించిన యువకుడిపై పోక్సో కేసు నమోదు చేసినట్లు వన్‌టౌన్ ఎస్ఐ హరిహరప్రసాద్ తెలిపారు. అన్నమయ్య జిల్లా మాలేపాడు పంచాయతీకి చెందిన పదిహేనేళ్ల బాలిక పట్టణంలోని మున్సిపల్ ఉన్నతపాఠశాలలో పదో తరగతి చదువుతోంది. ఈనెల 4న బాలిక పాఠశాలకు వస్తుండగా మాలేపాడుకు చెందిన ఆటో డ్రైవర్ మంజునాథ్ (24) తన వెంట తీసుకెళ్లిపోయాడు. స్థానికులు గమనించి బాలిక కుటుంబ సభ్యులకు సమాచారం అందించడంతో ఆమె తండ్రి వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదుచేశారు. కేసు నమోదుచేసి గాలించగా బాలిక కర్ణాటకలో ఉన్నట్లు గుర్తించి స్టేషన్‌కు తీసుకొచ్చారు. బాలిక ఫిర్యాదుమేరకు మంజునాథ్‌పై పోక్సో కేసు నమోదుచేసినట్లు తెలిపారు.

‘గిరి ప్రదక్షిణ’విజయం.. ‘శృంగిశైల’కు యత్నం

ఒంటిమిట్టలో పూనిక వహించనున్న ఆదిజాంబవ పీఠాలు



ఒంటిమిట్ట క్షేత్రం కుడివైపున శ్రీ శృంగిశైలం

కడప కల్చరల్ : పుష్ప ‘గిరి ప్రదక్షిణ’విజయవంతంగా ప్రారంభం కావడంతో జిల్లాలోని మరో పుణ్యక్షేత్రం ఒంటిమిట్టలోగల శృంగిశైల ప్రదక్షిణ కోసం ప్రయత్నాలు ప్రారంభమయ్యాయి. 10 సంవత్సరాలుగా సమీప ప్రాంతాల ఆదిజాంబవ సంఘాలు, పీఠాలు, మఠాల ప్రతినిధులు శృంగిశైల ప్రదక్షిణ చేస్తూనే ఉన్నా ప్రచారం లేక వెలుగులోకి రాలేదు. మార్చి 1న పుష్పగిరిలో గిరి ప్రదక్షిణ విజయవంతంగా ప్రారంభం కావడంతో ఒంటిమిట్టలో శృంగిశైల ప్రదక్షిణకు ప్రయత్నాలు మొదలయ్యాయి.

ప్రభుత్వ అధికారిక ఆలయం ఒంటిమిట్ట శ్రీ కోదండరామాలయంలోని మూల మూర్తులను జాంబవ ప్రతిష్టగా దీనిని జాంబవ క్షేత్రంగా పేర్కొంటున్నారు. జిల్లాలోని పలు ప్రాంతాల్లో జాంబవంతుని మూర్తుల ఆరాధన జరుగుతోంది. ఏటా శ్రీరామన నవమి నాడు ఆయా గ్రామాల ప్రజలు ఒంటిమిట్టను దర్శించుకుంటారు. దీంతో ఇది జాంబవ క్షేత్రమన్న మాట వెలుగులోకి వచ్చింది. జాంబవంతుడు ఒంటిమిట్ట రామయ్య సేవ చేస్తూ శృంగిశైలంపై తపస్సు చేసుకునేవాడని చరిత్రకారుల సమాచారం. తర్వాత ఈ క్షేత్రాన్ని అభివృద్ధి చేసిన మహాభక్తుడు ఆంధ్ర వాల్మీకి వావిలికొలను సుబ్బారావు ఆ(శృంగి) పర్వతంపై నివసించిన విషయం ఆ కొండపై నేటికీగల ఆయన నివాస భవనం ద్వారా తెలుస్తోంది.

పరంపరంగా...

ఒంటిమిట్ట క్షేత్రంలోని శ్రీ శృంగిశైలం అత్యంత పవిత్రమైనదని, ఆ క్షేత్రంతోపాటు జాంబవంతుని నివాసమైన శృంగిశైల ప్రాభవం కూడా కనుమరుగైందని ఆదిజాంబవ సంఘాలు అభిప్రాయపడుతున్నాయి. జాంబవంతుని వారసుడిగా తాము పది సంవత్సరాలుగా శిష్యగణంతో వచ్చి నిరాడంబరంగా శైల ప్రదర్శన చేస్తున్నామని వారు పేర్కొంటున్నారు. ప్రస్తుతం ఒంటిమిట్టకు పూర్వ వైభవం లభించడం, మార్చి 1న జిల్లాలో అలాంటి పురాతన సంస్కృతిని పునరుద్ధరించడంతో శృంగిశైలం ప్రదక్షిణకు కూడా ఆ సంఘాలు ఉత్సాహం చూపుతున్నాయి. త్వరలో జిల్లాలోని ఆది జాంబవ సంఘాలు, దక్షిణ ప్రాంతంలోని జాంబవ పీఠాలు, మఠాల ప్రతినిధులతో ఈ విషయంపై సమావేశం ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు.

ప్రచారం కల్పించాలి



మేము జాంబవంతుని వారసులుగా కడప సింహాసన నెలమంగళ మఠాధిపతిగా ఏటా స్థానిక భక్తులు, శిష్యగణంతో కలిసి శ్రీరామన వమి నాడు ఒంటిమిట్టలో శృంగి పర్వత ప్రదక్షిణను నిర్వహిస్తున్నాం. ప్రచారం లేక అది వెలుగులోకి రాలేదు. ఇటీవల పుష్పగిరి ప్రదక్షిణ విజయవంతం కావడం జిల్లాకు శుభ సూచకం. శృంగిశైల పర్వత ప్రదక్షిణకూడా సాధ్యమవుతుందని విశ్వసిస్తున్నాం శృంగిశైలం చుట్టు కొలత కూడా మూడు కిలోమీటర్లలోపే ఉంటుంది. కనుక స్పందన ఉంటుంది. ఆ క్షేత్రం అభివృద్ధి అవుతుంది. ప్రస్తుతం సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో టీటీడీ ఒంటిమిట్టను ఆధ్యాత్మిక కేంద్రంగా తీర్చిదిద్దుతుండడం గొప్ప విషయం. జాంబవంతుని విగ్రహాన్ని అక్కడి పార్వేట పర్వంతపై ఏర్పాట్లు చేస్తుండడం ప్రశంసనీయం.

– జాంబవశ్రీ ఆనంద ముని స్వామిజీ, కడప నెలమంగళ మఠాధిపతి